క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కన్నాయిగూడెం: మండలంలో విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ స్వామి శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అలాగే తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట దీక్ష



భూపాలపల్లి అర్బన్: సమగ్ర శిక్షా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శనివారం విద్యాశాఖ సమగ్ర శిక్షా విభాగం కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొని మద్దతు తెలిపారు. 18 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకత్వం, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రేగుల సహదేవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎండీ చాంద్ పాషా, తోకల వేణు, మహిళా అధ్యక్షురాలు చల్ల సునీత మాట్లాడుతూ.. రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రేగూరి సుభాకర్‌రెడ్డి, కుసునపు కిరణ్‌కుమార్, పెండెం మధుసూదన్, నక్క తిరుపతి, కుర్రె ప్రవీణ్, రమేష్‌నాయక్, తిరుపతి, సేవానాయక్, విజయపాల్ రెడ్డి, విజయ్ భాస్కర్, కృష్ణ, గణేష్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

భూపాలపల్లి అర్బన్: కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు మడికొండ స్వామి, నాయకులు బాబు, భాస్కర్, రమేష్, సరళ, భిక్షపతి, శంకర్, మొగిలి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

భూపాలపల్లి అర్బన్ : వరంగల్‌కు చెందిన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మునిసిపాలిటీ పరిధి లోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శనివారం ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు అశోక్ తెలిపారు. పాఠశాల ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జీ విద్యాశాఖ అధికారి రాజేందర్ హాజరయ్యారు. ఎన్‌ఆర్‌ఐ విక్రాంత్ సహకారంతో ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్, స్టడీ చైర్లు అందజేశారు.

కాళేశ్వరంలో చెడగొట్టు వాన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శనివారం రాత్రి గంటన్నర పాటు మోస్తారు వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురువడంతో రైతులు ఆందోళన చెందారు. పొలాల్లో ఆరబెట్టిన వడ్లు తడిసిపోతాయని పట్టాలు కప్పి ఊపిరిపీల్చుకున్నారు. పలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ఆలస్యం కావడంతో వరిధాన్యం కల్లాల్లో నిల్వ ఉండడంతో రైతులు పట్టాలు కప్పి ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కాపలా కాస్తున్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో సూరారం, బొమ్మాపూర్, బెగుళూర్, అన్నారం, మెట్‌పల్లి, అంబట్‌పల్లి, మహదేవపూర్ తదితర గ్రామాల్లో భారీవర్షం కురిస్తే వడ్లు వరద నీటిపాలు అవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికోతలు కూడా చివరి దశకు చేరుతున్నాయి. పొలాల్లో ఉన్న వరి కూడా నేలపాలు కానుందని రైతులు మొరపెట్టుకుంటున్నారు.

ఆటోల బంద్ ప్రశాంతం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఆ టోడ్రైవర్లు తమ డిమాండ్ల సాధనకు శనివారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆటో జేఏసీ అధ్యక్షుడు తాజోద్దీన్ ఆధ్వర్యంలో బంద్ పాటించి తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు అక్రమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం: ఆటో డ్రైవర్ల జీవనోపాధి భరోసా కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆటో యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం మండలంలో నిర్వహించిన ఆటోల బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు కారణంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

చి‘వరి’కి సాగునీరు ఎలా?

- నర్సింహుల కాల్వ కింద ఎండిపోతున్న పంటలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



నర్సింహుల కాల్వ కింద ఎండిపోయిన వరి (ఫైల్)

గోవిందరావుపేట: లక్నవరం చెరువు కింద వరి పంట సాగుకు నాలుగు ప్రధాన కాల్వలు ఉన్నాయి. కాగా, శుక్రవారం నీటి పారుదల శాఖ అధికారులు శ్రీరాంపతి కాల్వ, నర్సింహుల కాల్వ కింద కలిపి 4150 ఎకరాల పంటకు సాగుకు తైబందీ ఖరారు చేశారు. ఈ క్రమంలో నర్సింహుల కాల్వ కింద పండించుకునే రైతులు మాత్రం ఆందోళనకు గురవుతున్నారు. నర్సింహుల కాల్వ కింద ఛానల్ 1, ఛానల్ 2గా రెండు కాల్వల ద్వారా పంటలకు నీరు వెళ్తోంది. ఛానల్ 1 కింద పాల పంపు, బురదన్ పాయ, ఊర కాల్వల ద్వారా 1500 ఎకరాల పంటలకు, ఛానల్ 2 కింద పుట్ల పంపు, గౌరారం కాలువల ద్వారా 1500 ఎకరాల పంటలకు నీరు వెళ్తోంది. గత కొన్ని సంవత్సరాల క్రితం రొటేషన్ పద్ధతిలో ప్రతీ యాసంగి పంటకు అధికారులు ఛానల్ 1కు, ఒక సంవత్సరం, ఛానల్2 ఒక సంవత్సరం సాగు నీరు కేటాయించేవారు. దీంతో చివరి ఆయకట్టు రైతులు పంటలకు ఎటువంటి ఆటంకం లేకుండా పండించుకునే వారు. కానీ ప్రస్తుతం అధికారులు నర్సింహుల కాలువ కింద 3050 ఎకరాలకు తైబందీ ఖరారు చేస్తుండడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. చివరి దశలో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. దాదాపు చివరి ఆయకట్టుకు 300 నుంచి 400 ఎకరాలు పంట ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు రైతులను అందరితో సమావేశం ఏర్పాటు చేసి తైబందీ ఖరారును మరోక్కసారి స్పష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.

చివరి దశలో నీరు అందదు



గతంలో అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రొటేషన్ పద్ధతిలో నర్సింహుల కాల్వ కింద నీటిని విడుదల చేసేవారు. అప్పుడు ఎలాంటి ఆటంకం లేకుండా పండించుకునేవాళ్లాం. కానీ ప్రస్తుతం మాత్రం అధికారులు నర్సింహుల కాల్వ కింద 3050 ఎకరాలకు తైబందీ ఖరారు చేశారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోతాయి. అలాగే కాల్వ మోటార్లతో దొంగ సాగు చేయకుండా అధికారులు చూడాలి.

- రావుల యాకబ్ రెడ్డి, ఆయకట్టు రైతు

తైబందీ ప్రకారమే విడుదల చేస్తాం..



మండలంలోని రైతులు అందరిని గోవిందరావుపేట రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేసి శుక్రవారం యాసంగి తైబందీ ఖరారు చేశాం. ఈ మేరకు 4150 ఎకరాలకు సాగు నీరును విడుదల చేస్తాం. కాల్వపై మోటార్లు పెట్టి దొంగతనంగా పంటలు పండిస్తే కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

- సీహెచ్ శ్రీనివాస్, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఈ

అడవుల రక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఎఫ్ఎస్ఓ మల్ల నాగమణి

వాజేడు: అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎఫ్ఎస్ఓ మల్ల నాగమణి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి అటవీశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అడవుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. అడవికి నిప్పు పెట్టడం మానవ మనుగడకు ముప్పని అన్నారు. అడవులు అంతరిస్తే స్వచ్ఛమైన ఆక్సిజన్ అందకపోడంతో పాటు సకాలంలో వర్షాలు పడక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అడవులను రక్షించుకోవడం ద్వారా పండ్లు, ఫలాలను పొందే అవకాశం ఉందన్నారు. ఎవరైనా అడవిలో నిప్పు పెడితే అటవీ శాఖ సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వడంతో పాటు రక్షించుకోవడానికి అందరం కలిసి వెళ్లాలని తెలిపారు. ఎఫ్‌బీఓ సరోజ, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

గోవిందరావుపేట: మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన కురిమిల్ల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ శనివారం పరామర్శించి రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు రసపుత్ సీతారాంనాయక్, జెట్టి సోమయ్య, కణతల నాగేందర్ రావు, మద్దాలి నాగమణి, శ్రీను, భూక్య సుక్య, బాలు, తుమ్మల శివ పాల్గొన్నారు.

హరీశ్‌ను కోల్పోవడం తీరని లోటు

వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్



మాట్లాడుతున్న సీఐ బండారి కుమార్

వాజేడు: ప్రజలకు మంచి చేసే ఎస్సైని కోల్పోవడం తీరని లోటని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వెంకటాపురం(కె), పేరూరు ఎస్సైలు కొప్పుల తిరుపతి రావు, గుర్రం కృష్ణప్రసాద్, డీటీ రాహుల్‌చంద్ర వర్మ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వాజేడు, వెంకటాపురం(కె) మీడియా ఆధ్వర్యంలో ఎస్సై రుద్రారపు హరీష్ సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ముందుండే వ్యక్తి అని కొనియాడారు. మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలోని విద్యార్థినులకు చదువు, ఆర్థిక పరంగా ఎలాంటి సాయం కావాలన్నా చేసే వారన్నారు. వాజేడుకు ఎస్సైగా వచ్చిన ఆరు నెలల కాలంలోనే ప్రజల నుంచి మంచిపేరును సంపాదించుకున్నారని గుర్తుచేశారు. అందరి మన్ననలు పొందిన ఆయన అనతికాలంలోనే మృతి చెందడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ మాట్లాడుతూ ఎస్సైతో ఏర్పడిన బంధం వివరించారు. అంతకు ముందు ఎస్సై చిత్రపటం వద్ద సీఐ జ్యోతిని వెలిగించగా అందరు మౌనం పాటించారు.

నాపాక ఆలయానికి హద్దులు కేటాయింపు



హద్దులు కేటాయిస్తున్న అధికారులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలోని నాపాక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ 401 సర్వే నంబర్‌లో 2.18 గుంటల విస్తీర్ణానికి సంబంధిత అధికారులు శనివారం హద్దులు కేటాయించారు. గతంలో నాపాక ఆలయం చుట్టూ ఉన్న భూమి అన్యాక్రాంతం కావడంతో గ్రామస్తులు ఎండోమెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు ఆలయం చుట్టూ ఉన్న భూమికి సర్వే చేసి హద్దులు కేటాయించారు. అలాగే 402, 403 సర్వేలో కూడా మరింత భూమి ఉన్నట్లు దానిని వెంటనే సర్వే చేసి ఆలయం భూములకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పరకాల డివిజన్ పరిశీలకురాలు కవిత, దేవాదాయ శాఖ సర్వేయర్ అనిల్, దేవాదాయ అర్చకులు ప్రభాకారాచార్యులు, ఆలయ చైర్మన్ యాదండ్ల రాజయ్య, గ్రామస్తులు ఎర్రయ్య, ఐలయ్య, కమల, గట్టయ్య, నక్క భాస్కర్, దేవేందర్‌రెడ్డి, ఐలయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

‘ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం’

మల్హర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏడాది కాలంలో అన్ని చేశామంటూ సంబురాల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినాల్లో భాగంగా శనివారం మల్హర్ మండలంలోని తాడిచర్లలో పుట్ట మధు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కార్ అన్ని రంగాల్లో విఫలం అయిందని, ఏ వర్గానికి మేలు చేయకుండా కేవలం గొప్పలు చెప్పుకోవడానికే పరిమితం అయిందన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి ఉన్నారు.

దేశం మెచ్చిన మన ‘చపాట’

- వరంగల్ మిర్చికి దక్కిన జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ట్యాగ్
- తెలంగాణ నుంచి 18వ ఉత్పత్తిగా ప్రత్యేక గుర్తింపు



సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికంగా పండిస్తున్న చపాట మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ట్యాగ్ (జీఐ ట్యాగ్) లభించింది. ఇప్పటికే తెలంగాణ నుంచి పోచంపల్లి ఇకత్, కొండపల్లి బొమ్మలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నిర్మల్ బొమ్మలు, హైదరాబాద్ హలీమ్ వంటి తో పాటు మరికొన్ని భౌగోళిక గుర్తింపు దక్కించుకున్నాయి. తాజాగా ఈరేసులో దేశంలోనే అత్యంత తీపి మిర్చి రకంలో ఒకటైన చపాట వరంగల్ మిరప నిలిచింది.

చపాట మిరపకు జీఐ ట్యాగ్ కోసం తిమ్మంపేట మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రెండేళ్ల క్రితం దరఖాస్తు చేయగా.. ఇండియన్ పెటెంట్ ఆఫీస్ (ఐపీఓ) తాజాగా ఆమోదించింది. ‘జియోగ్రాఫిక్ ఇండికేషన్స్ జర్నల్’లోనూ చపాట రకం మిర్చికి సంబంధించిన వివరాలు ప్రచురితమయ్యాయి. రెండేళ్ల క్రితం చపాట మిర్చికి వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాకు రూ.లక్ష వరకు ధర పలికింది. తాజాగా జీఐ ట్యాగ్‌తో ఈ రకం మిర్చి ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు అయ్యింది.

18వ ఉత్పత్తిగా చపాట..

చపాట మిర్చి.. పొట్టిగా.. లావుగా టమాటను పోలి ఉంటుంది. ఈ రకం మిరపను ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు చాలా కాలంగా పండిస్తున్నారు. డబుల్ పట్టి, సింగిల్ పట్టి, లంబుకాయ, టమాట మర్చి తదితర పేర్లతో దీన్ని పిలుస్తుంటారు. ఈరకం మిరపలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ముఖ్యంగా విత్తనోత్పత్తిని రైతులు స్వయంగా చేసుకోవడంతో పాటు పంట సాగులో కూలీల ఖర్చు కూడా ఎంతో తక్కువ. అందుకే చపాట మిర్చిసాగులో రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా బాగా కలిసి వస్తోంది. వరంగల్ మిరపకాయ అని కూడా పిలవబడే చపాట మిర్చి రంగు ప్రత్యేకంగా ఉంటుంది. మెక్సికన్ క్యాప్సికమ్‌ను పోలి ఉండే ఈ మిరపను ఉమ్మడి జిల్లాలోని పరకాల, రేగొండ, నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఏటూరునాగారం, ములుగు ప్రాంతాల్లో దాదాపు 15,318 ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ఈమిర్చి ఎక్కువ ఎరుపు రంగులో ఉండడంతో పాటు కారం తక్కువగా ఉంటుందని ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు, మిర్చి రైతులు చెబుతున్నారు. స్కోవిల్లే స్కేల్‌లో ఈ మిరపకాయ యొక్క ఘాటు తక్కువగా ఉంటుందని తేలింది. ఈ మిర్చిని ఆహారశుద్ధి పరిశ్రమ, రెస్టారెంట్లు, బేవరేజెస్, పచ్చళ్ల తయారీలో అధికంగా వీటిని ఉపయోగిస్తున్నారు. ఈ మిర్చికి అంతర్జాతీయంగా, మరీ ముఖ్యంగా తూర్పు ఆసియాలో విపరీతమైన డిమాండ్ ఉందని అధికారులు తెలిపారు. ఇందులో అనేక రకాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ మిర్చికి భౌగోళిక గుర్తింపు రావడంతో.. తెలంగాణ నుంచి జీఐ ట్యాగ్ సాధించిన 18వ ఉత్పత్తిగా చపాట వరంగల్ మిర్చి నిలిచింది.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



వెంకటాపురం(కె): సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



ఏటూరునాగారం: పూజలు చేస్తున్న భక్తులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలోని వల్లిదేవసమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. సుబ్రమణ్య షష్టి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆలయ పురోహితులు రామశర్మ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహానికి భక్తులు శనివారం పంచామృత అభిషేకాలను నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలను అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ నిర్వహించారు. చలివిడితో పాటు పలు ప్రసాదాలను స్వామివారికి సమర్పించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా కారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు

వాజేడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మండలానికి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు.

బీడీ శర్మ ఆశయాలను కొనసాగిద్దాం..



ఏటూరునాగారం: బీడీ శర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీలు



వెంకటాపురం(కె)లో..

ఏటూరునాగారం: డాక్టర్ బీడీ శర్మ ఆశయాలను కొనసాగిద్దామని ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహాదారుడు పొదెం కృష్ణప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని కొమురం భీం విగ్రహం వద్ద బీడీ శర్మ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ శర్మ ఆదివాసీల కోసం ఎంతో కృషి చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, జనార్దన్, కోటే రవి, ఈసం నర్సయ్య, కాక భాస్కర్, నర్సయ్య, చంద్రకళ, స్వరూప, నారాయణమ్మ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో శనివారం బీడి శర్మ వర్ధంతిని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల పక్షాన పోరాటం చేసిన వ్యక్తి బీడి శర్మ అన్నారు. ఆదివాసీ హక్కుల గొంతుక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, ఉయిక శంకర్, పూనెం సాయి, రామచందర్, నర్సింహామూర్తి, సర్వేశ్వరావు, మహేశ్ తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

ఏటూరునాగారం: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై వెలమ సంఘం నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు శనివారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా నాయకులు ధన్నపునేని కిరణ్, తక్కెల్లపల్లి వెంకటేశ్వర్‌రావు, దినాకర్ మాట్లాడుతూ.. శంకర్ వెలమ సామాజిక వర్గాన్ని నానా బూతులు తిట్టాడన్నారు. చంపుతానని, నరుకుతానని, ఇలా చెప్పలేని మాటలు అన్నందుకు అతడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధన్నపునేని కిషన్‌రావు, చెట్టుపల్లి శ్రీనివాస్‌రావు, తక్కెలపల్లి వెంకటేశ్వర్‌రావు, కాకులమర్రి భాస్కర్‌రావు, కాకులమర్రి రవీందర్, అమర్ పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

మంగపేట: కాంగ్రెస్ ప్రభుత్వం బిల్టు కార్మికులకు న్యాయం చేయాలని బాధిత కార్మికులు శనివారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిల్టు కార్మికులు, పరిశ్రమపై ప్రత్యేక శ్రద్ధ చూపించి కార్మాగారాన్ని ఐటీసీ కంపనీ యాజమాన్యానికి విక్రయించినట్లు తెలిపారు. త్వరలోనే పరిశ్రమను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. బిల్టు ఫ్యాక్టరీని పునరుద్ధరించే ముందు నష్టపోయిన 650 మంది కార్మికులను ఆదుకోవాలని కోరారు. విషయంపై పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తమకు న్యాయం జరిగే విదంగా శ్రద్ధ చూపి కార్మికులను ఆదుకోవాలన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

టేకుమట్ల: నియోజకవర్గానికి మంజూరైన 3500 ఇందిరమ్మ ఇళ్లను అర్హులందరికీ కేటాయిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శని వారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మె ల్యే హాజరై మాట్లాడారు. సంవత్సర కాలంలోనే మండలంలో వంతెన పునఃనిర్మాణం, తహసీల్దార్, ఎంపీడీఓ భవనాలకు శంకుస్థాపన, టేకుమట్ల–నవాబుపేట ప్రధాన రోడ్డు నిర్మాణం, చెరవులు మరమ్మతులు, రోడ్ల మరమ్మతులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదా రులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, రాష్ట్ర నాయకులు రాంనర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ అనిత ఉన్నారు.